క్లుప్తంగా

ఫార్మర్ రిజిస్ట్రీ యాప్‌పై ఏఈవోలకు శిక్షణ



రాజంపేట : ప్రతి పౌరుడికి ఆధార్ లాగే, ప్రతి రైతుకు 11 నంబర్లతో విశిష్ట సంఖ్యను కేటాయించాలని కేంద్రం నిర్ణయించిందని వ్యవసాయ డివిజనల్ అధికారి అపర్ణ అన్నారు. గురువారం రాజంపేట రైతు వేదిక భవనంలో కామారెడ్డి, బీబీపేట, పాల్వంచ, దోమకొండ, రాజంపేట, మాచారెడ్డి, భిక్కనూరు మండలాలకు చెందిన వ్యవసాయ విస్తరణ అధికారులకు ఫార్మరీ రిజిస్ట్రీ యాప్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫార్మరీ రిజిస్ట్రీలో వ్యవసాయ విస్తరణ అధికారులు, ఆయా ప్రాంతాలకు చెందిన రైతుల వివరాలు నమోదు చేస్తారని తెలిపారు. సంబంధిత ఏఈవోలకు యాప్‌పై అవగాహన కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏవో తబసుమ్, ఏవోలు, ఏఈవోలు పాల్గొన్నారు.

చేనేత శిక్షణ తరగతులు ప్రారంభం



దోమకొండ: మండల కేంద్రంలోని ఆనంద్‌భవన్‌లో గురువారం చేనేత శిక్షణ తరగతులు మూడవ బ్యాచ్‌ను ప్రారంభించినట్లు గడికోట ట్రస్టు మేనేజర్ బాబ్జీ తెలిపారు. దోమకొండ ట్రస్ట్ చేనేతపై శిక్షణ, ఉపాధి అవకాశాలను చూపుతూ కేంద్ర ప్రభుత్వం సమర్థ్ అనే పథకం కింద రెండు బ్యాచుల్లో 40 మంది గ్రామీణ మహిళలకు శిక్షణను అందించి ఉపాధి అవకాశాలను కల్పిస్తుందన్నారు. మూడో బ్యాచ్‌శిక్షణకు ఎంపికైన వారికి కిట్‌లను అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఐకేపీ ఏపీఎం రాజు, చేనేత సహకార సంఘం జిల్లా అధికారి పుగులెంతి, డెవలప్‌మెంట్ అధికారి సంతోష్ కుమార్, టెక్నికల్ టీం సభ్యులు భరత్, పవన్ కుమార్, దోమకొండ చేనేత సంఘం అధ్యక్షుడు బొమ్మెర లక్ష్మీనారాయణ, గడికోట ట్రస్టు కోఆర్డినేటర్ గణేష్ యాదవ్, చేనేత శిక్షకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



ఎల్లారెడి: అనారోగ్యంతో మృతి చెందిన మిత్రుడి అంత్యక్రియలకు తోటి మిత్రులు రూ. 25 వేల ఆర్థిక సహాయం అందించారు. ఎల్లారెడ్డికి చెందిన పామయ్యాగారి శ్రీకాంత్‌గౌడ్ (37) గురువారం అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. శ్రీకాంత్ గౌడ్ అంత్యక్రియలకు 2003–2004 పదో తరగతి బ్యాచ్ మిత్రులు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో మహేష్, అశోక్, లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

విద్యుత్ సంస్థలో కారుణ్య నియామకం



లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల కేంద్రానికి చెందిన కేందర్ల లక్ష్మికి లింగంపేట ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్‌లో ఉద్యోగం కల్పించినట్లు ఏడీఈ మల్లేశం తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వహించిన కేందర్ల నర్సింలు గతేడాది జనవరిలో గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన భార్య లక్ష్మికి గ్రేడు–4 ఉద్యోగం కల్పించడంతో, లింగంపేటలోని విద్యుత్ శాఖ సబ్ డివిజన్ కేంద్రంలో గురువారం విధుల్లో చేరినట్లు ఆయన తెలిపారు.కార్యక్రమంలో ఏఈ సాయినాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని అచ్చంపేట, మల్లూర్ సహకార సంఘాల గోదాంలు, గాయత్రి కర్మాగారం ఎరువుల దుకాణాన్ని గురువారం వ్యవసాయశాఖ ఏడీఏ అమీనాబి తనిఖీ చేశారు. ఆయా గోదాంల్లో నిల్వ ఉన్న యూరియా, కాంప్లెక్స్ ఎరువుల వివరాలను తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి అమర్‌ప్రసాద్, సొసైటీల సీఈవోలు సంగమేశ్వర్‌గౌడ్, సాయిలు, సిబ్బంది ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో వసతులు కరువు

- ఎల్లారెడ్డి మండలంలో 30 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు
- తాగునీరు, టెంట్లు, కరెంటు లేక ఇబ్బందులు పడుతున్న రైతన్నలు
- చెట్లకింద సేదతీరుతున్న పరిస్థితి



గండిమాసానిపేటలో చెట్టుకింద కూర్చున్న మహిళలు



హాజీపూర్‌లో ఆరబోసిన ధాన్యం

ఎల్లారెడ్డిరూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ప్రభుత్వం అన్ని సౌకర్యాలను కల్పించాలని ఆదేశించినప్పటికి క్షేత్రస్థాయిలో ఎలాంటి సౌకర్యాలు అందించడంలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎండలు మండుతుండడంతో కనీసం నీడలేక ఇబ్బందులు పడుతున్నారు. తాగేందుకు నీరు కూడా అందుబాటులో ఉంచడంలేదని వాపోతున్నారు. ఎల్లారెడ్డి మండలంలో ప్రభుత్వం సొసైటీలు, ఐకేపీల ఆధ్వర్యంలో 30 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఐకేపీ ద్వారా 14 ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఎల్లారెడ్డి సొసైటీ ద్వారా 09, మత్తమాల సొసైటీ ద్వారా 03, వెల్లుట్ల సొసైటీ ద్వారా 04 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటితో పాటు మరికొన్ని సబ్ సెంటర్లలో ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అధికారులు రైతుల సౌకర్యార్థం తాగునీరు, టెంట్లు లేదా పందిరి వేయడం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచడం, టార్పాలిన్లు అందించడం, కరెంటు ఏర్పాటు, ప్యాడీక్లీనర్లు అందించాలి. వీటిలో కనీసం తాగేందుకు నీరు లేక అందించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. పందిరి టెంట్లు లేక పోవడంతో చెట్ల నీడన కూర్చుని సేద తీరుతున్నామని వారు పేర్కొన్నారు.

అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం

రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నాం. ఏవైనా ఇబ్బందులు ఉంటే వాటిని పరిష్కరిస్తాం. రైతులకు టార్పాలిన్లు, ప్యాడీక్లీనర్లు అందుబాటులో ఉంచాం. కోతుల ఇబ్బందులతో సొసైటీ గోదాంలో నీటిని అందుబాటులో ఉంచాం.

– విశ్వనాథం, కార్యదర్శి, ఎల్లారెడ్డి సొసైటీ

తాగేందుకు నీరు లేదు



ధాన్యం కొనుగోలు కేంద్రంలో త్రాగేందుకు నీరు లేదు. ఇంటి నుంచి నీటిని తీసుకుని వస్తున్నాం. ధాన్యం కొనుగోలు కేంద్రంలో సౌకర్యాలను కల్పించాలి.

– గురునాథ్, కట్టకిందితండా

సరిపడా బల్బులు లేవు



ధాన్యం కొనుగోలు కేంద్రంలో సరిపడా విద్యుత్ బల్బులు లేవు. రాత్రి సమయంలో చీకటిగా ఉండడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

– రమేష్, కట్టకిందితండా

చెట్టు నీడలో కూర్చుంటున్నాం



ధాన్యం కొనుగోలు కేంద్రంలో చిన్న పందిరి వేశారు. దానిలో ప్యాడీ క్లీనర్ ఉంచారు. దీంతో చెట్ల నీడలో కూర్చుని ఉంటున్నాం. పెద్ద పందిరి వేయాలి. రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి.

– గంగవ్వ, పోసానిపల్లి

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతోనే పోషకాహార లోపం లేకుండా ఎదుగుతారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి అన్నారు. గురువారం పోషణ్ పక్వాడ్ కార్యమాన్ని నస్రుల్లాబాద్‌లో నిర్వహించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సామూహిక శ్రీమంతాలు, అక్షరాభ్యాసాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు గంగమణి, గౌతమి, ఆశ క్యార్యర్తలు కవిత, లావణ్య, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కిచెన్ గార్డెన్ పరిశీలన..

మండల కేంద్రంలో గల అంగన్ వాడీ సెంటర్–1ని సూపర్ వైజర్ వాణి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్‌ను పరిశీలించి అంగన్‌వాడీ టీచర్ గౌరమ్మను అభినందించారు. ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లో కిచెన్ గార్డెన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని గోపాల్‌పేట అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అంగన్‌వాడీ టీచర్ తులసి అవగాహన కల్పించారు. పోషణ్ పక్వాడాలో భాగంగా చిన్నారులకు అందించే పౌష్టికాహారంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం అంగన్ వాడీ కేంద్రంలోని చిన్నారులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే డాక్టర్ నిఖత్, ఫార్మాసిస్ట్ ఉమ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు అన్నప్రాసన చేయిస్తున్న సూపర్ వైజర్ వాణి

స్వయం ఉపాధి ద్వారా మహిళలకు లబ్ధి

బాన్సువాడ : స్వయం ఉపాధి ద్వారా మహిళలు లబ్ధి పొందవచ్చునని వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం బాన్సువాడలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌లతో కలిసి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందజేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, వడ్డీ లేని రుణాలు ఇస్తుందని అన్నారు.కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఏడీ దయానంద్, నాయకులు జంగం గంగాధర్, కృష్ణరెడ్డి, సామాజిక ఆశయ సాధన సేవ సంస్థ వ్యవస్థాపకులు సందుల గంగారం తదితరులు ఉన్నారు.



మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్న వ్యవసాయ సలహాదారు పోచారం

సిల్వర్‌జూబ్లీ వేడుకలను సక్సెస్ చేయాలి

బాన్సువాడ రూరల్: శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాల స్థాపించి 25 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా నిర్వహించే సిల్వర్‌జూబ్లీ వేడుకను సక్సెస్ చేయాలని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం కళాశాలలో ప్రిన్సిపల్ డా. వేణుగోపాల స్వామీ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులు, నిర్వాహణ కమిటీతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ 24న సిల్వర్ జూబ్లీ వేడుకలకు ప్రస్తుత విద్యార్థులు, పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ గులాం ముస్తాఫా, నాయకులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

పార్ట్ టైం అధ్యాపకుల అరెస్టు

భిక్కనూరు: ఉద్యోగ భద్రత కోసం చలో సెక్రటరియేట్ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ వెళ్తున్న తెలంగాణ యునివర్సిటీ ప్రధాన క్యాంపస్‌కు చెందిన పార్ట్ టైం అధ్యాపకులతో పాటు సౌత్ క్యాంపస్‌కు చెందిన పార్ట్ టైం అధ్యాపకులను భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద ఎస్సై అంజనేయులు గురువారం అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారికి బీఎంఎస్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సందుగారి రవీందర్‌రెడ్డి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వారికి సంఘీభావం తెలిపారు. వీరి ఉద్యమానికి తమ సంఘం సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు



భిక్కనూరు పోలీస్‌స్టేషన్‌లో అరెస్టయిన పార్ట్ టైం అధ్యాపకులు

సౌత్ క్యాంపస్ కాంట్రాక్ట్ అధ్యాపకులను అరెస్టు చేసిన అఫ్జల్‌గంజ్ పోలీస్‌లు

ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో గాంధీభవన్ వద్ద మౌనదీక్షకు కూర్చున్న యునివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులను అఫ్జల్‌గంజ్ పోలీస్‌లు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో సౌత్‌క్యాంపస్‌కు చెందిన కాంట్రాక్ట్ అధ్యాపకులు, కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యాక్షుడు నారాయణగుప్తా, ప్రతినిధులు సునీత, సరిత, నర్సయ్య, నిరంజన్‌శర్మలు ఉన్నారు. సాయంత్రం వరకు పోలీస్‌స్టేషన్‌లో ఉంచుకుని తదుపరి స్వంత పూచికత్తుపై వదిలిపెట్టారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యాక్షుడు నారాయణగుప్తా మాట్లాడుతూ అరెస్టులతో బెదిరేది లేదని ఆందోళనను కొనసాగిస్తామన్నారు.

తరగతులు బహిష్కరించిన విద్యార్థులు

తెలంగాణ యునివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో కాంట్రాక్ట్, పార్ట్ టైం అధ్యాపకులకు మద్దతుగా విద్యార్థులు తరగతులు బహిష్కరించి నిరసన కార్యక్రమాలను చేపట్టారు. కాంట్రాక్ట్, పార్ట్ టైం అధ్యాపకులకు ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సౌత్‌క్యాంపస్‌లో ర్యాలీ నిర్వహించారు.

మున్నూరు కాపు సంఘం మండల, పట్టణ కార్యవర్గం ఎన్నిక



గాంధారి(ఎల్లారెడ్డి): మున్నూరు కాపు సంఘం మండల నూతన కార్యవర్గాన్ని గురువారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. మండల అధ్యక్షుడిగా ఆకుల బాల్‌కిషన్, ఉపాధ్యక్షులుగా సింగసాని పండరి, పత్తి శివకుమార్, కూచి గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా ఉప్పు సాయిలు, కోశాధికారిగా తాడ్వాయి విఠల్, సంయుక్త కార్యదర్శిగ గోనె వెంకట్ ను ఎన్నుకున్నట్లు తెలిపారు. గాంధారి పట్టణ అధ్యక్షుడిగా పత్తి సాయిలు, ప్రధాన కార్యదర్శిగా తాడ్వాయి సంతోష్, ఉపాధ్యక్షులుగా బండారి రమేష్, పత్తి రవి, కోశాధికారిగ పొలింగ్ నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మున్నూరు కాపు నాయకులు పాల్గొన్నారు.

జీవాలకు వ్యాధులు సోకకుండా టీకాలు వేయించాలి



ఎల్లారెడ్డిరూరల్: పశువులకు వ్యాధులు సోకకుండా టీకాలను వేయించాలని జిల్లా పశు సంవర్ధక అధికారి సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డి మండలం అన్నాసాగర్, తిమ్మారెడ్డి గ్రామాలలో నిర్వహించిన గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. పశువుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఉచితంగా టీకాలను వేస్తుందన్నారు. వైద్యులు అర్చన, విజయ్, సిబ్బంది సాయిరెడ్డి, రమేష్ తదితరులున్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

లింగంపేట/తాడ్వాయి/నాగిరెడ్డిపేట : లింగంపేట మండలం లింగంపల్లి(ఖుర్దు) గ్రామంలో గురువారం మండల పశువైద్యాధికారి హన్నా జాన్సన్ పశువులకు వైద్య పరీక్షలు చేశారు. తాడ్వాయి మండలం కృష్ణాజివాడీలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామని మండల పశువైద్యాధికారి రమేష్ తెలిపారు. నాగిరెడ్డిపేట మండలం లింగంపల్లికలాన్ గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను మండల పశువైద్యాధికారి రవికుమార్ వేశారు. ఈకార్యక్రమంలో పశువైద్యసిబ్బంది, గోపాల మిత్రలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

ఎల్లారెడ్డి/మద్నూర్ : అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎల్లారెడ్డి ఫైర్ ఆఫీసర్ వినోద్ గురువారం వివరించారు. మండలంలోని బాలాజీనగర్ తండాలో గ్యాస్ సిలిండర్ నుంచి ఆకస్మాత్తుగా మంటలు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన చర్యలను తండావాసులకు సూచించారు. మద్నూర్ లోని హౌసింగ్ బోర్డు కాలనీలో గురువారం అగ్ని ప్రమాదాలపై ఫైర్ సిబ్బంది అవగాహన కల్పించారు. అగ్నిమాపక శకటం పనితీరును, మంటలను ఆర్పివేసే విధానాన్ని సిబ్బంది గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ రాజయ్య, లీడింగ్ ఫైర్‌మెన్ నర్సింలు, ఫైర్‌మెన్‌లు రాణప్రతాప్‌సింగ్, కరుణాకర్, నవీన్, హరిష్, గ్రామస్తులు, అగ్నిమాపక సిబ్బంది, తండావాసులు ఉన్నారు.



బాలాజీనగర్ తండాలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

నస్రుల్లాబాద్ ఆర్ఐగా వెంకట స్వామి



వెంకట స్వామి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): నస్రుల్లాబాద్ మండలం ఆర్ఐగా వెంకటస్వామి గురువారం బాధ్యతలు స్వీకరించినట్లు తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. గతంలో విధులు నిర్వహించిన సాయిలు నిజాంసాగర్ కు బదిలీ అయ్యారని తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ అలీం బాన్సువాడ ఆర్డీవో ఆఫీసుకు బదిలీ కాగా అతని స్థానంలో ప్రియాంక బాధ్యతలు స్వీకరించారు.

డోంగ్లీ ఆర్ఐగా సాయిబాబా



సాయిబాబా

మద్నూర్(జుక్కల్) : డోంగ్లీ మండల నూతన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా (ఆర్ఐ) సాయిబాబా గురువారం బాధ్యతలు చేపట్టారు. నిజాంసాగర్ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐగా పని చేసిన ఆయన మద్నూర్‌కు బదిలీపై వచ్చినట్లు ఆయన తెలిపారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఆర్ఐ వెంకటస్వామి నస్రూల్లాబాద్ మండలానికి బదిలీపై వెళ్లారు.

ఆధ్యాత్మికం

భేతాళుడికి ఎడ్ల బండ్లతో ప్రదక్షిణ



బాన్సువాడ : పట్టణంలోని భేతాళ స్వామి జాతర వైభవంగా ప్రారంభమైంది. జాతర మొదటి రోజు గురువారం భేతాళుడి ఆలయం చుట్టూ ఎడ్ల బండ్ల ప్రదర్శన నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయానికి భక్తుల తాకిడి మొదలైంది. వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌లు ప్రత్యేక పూజలు చేశారు. ఎడ్లను, బండ్లను చూడముచ్చటగా అలంకరించిన రైతులకు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మంత్రి అంజవ్వ, మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు, బీఆర్ఎస్ నాయకులు జుబేర్ ఆధ్వర్యంలో బహుమతులు, నగదు అందజేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు వచ్చి భేతాళుడిని దర్శించుకున్నారు.

ఘనంగా ప్రారంభమైన పెద్దమ్మ ఉత్సవాలు



దోమకొండ: మండల కేంద్రంలోని వనదుర్గ పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఎడ్ల బండ్ల ప్రదర్శన గ్రామంలోని ప్రధాన వీధుల గుండా నిర్వహించారు. శుక్రవారం పెద్దమ్మ–పెద్దిరాజుల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగరపు ఎల్లయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పున్న లక్ష్మణ్, కామిండ్ల కృష్ణ, పురుషోత్తం, అబ్రబోయిన రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

25న ఇష్టకార్య సిద్ది ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

కామారెడ్డి అర్బన్ : పట్టణంలోని ఆర్‌బీ నగర్ కాలనీలోని ఇష్ట కార్యసిద్ధి ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం ఈనెల 25న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు సత్యనారాయణ గౌడ్, బాల్‌కిషన్, దేవచారిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం కుంభాభిషేకం, 11–30 గంటలకు సువర్చలా సహిత హనుమాన్ కల్యాణం, అన్నదానం కార్యక్రమాలుంటాయని, భక్తులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ముస్తాబైన చర్చి..



ఎల్లారెడ్డి: గుడ్‌ఫ్రైడే ఉత్సవాలకు పట్టణంలోని సీఎస్ఐ చర్చి ముస్తాబైంది. శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం జరుగుతుందని చర్చి ఫాదర్ తెలిపారు. 41 రోజుల ఉపవాస దీక్షల అనంతరం గుడ్‌ఫ్రైడే నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఘనంగా లక్ష్మీదేవి ఆలయ వార్షికోత్సవం



మాచారెడ్డి : మండలంలోని ఎల్లంపేట గ్రామంలో మాజీ ఎంపీపీ నర్సింగరావు తన సొంత డబ్బులతో నిర్మించిన శ్రీలక్ష్మీదేవి ఆలయ నాలుగో వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి పూజలు చేశారు. అలాగే గ్రామస్తుల కోరికమేరకు గ్రామ పంచాయతీ వద్ద హైమాస్ట్ లైట్ ను ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఖాజావలి, విండో చైర్మన్ పూల్‌చంద్‌నాయక్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రామ్మోహన్, చంద్రునాయక్ ఉన్నారు.

పాఠశాలల్లో వీడ్కోలు సంబురాలు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కొండాపూర్, భవానిపేట, భవానిపేట హరిజనవాడ ప్రాథమిక పాఠశాలల్లో గురువారం వీడ్కోలు సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 5వ తరగతి విద్యార్థులకు కింది తరగతుల విద్యార్థులు వీడ్కోలు సమావేశాలు ఏర్పాటు చేశారు. చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి.



వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు

సంక్షిప్తం

పోస్టాఫీస్ భవన నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని పోస్టాఫీస్ భవనం నిర్మాణానికి తపాల శాఖ ద్వారా రూ.40 లక్షలు నిధులు మంజూరైనట్లు గురువారం జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ సోషల్ మీడియా జాయింట్ కన్వీనర్ తమ్మేవార్ అజయ్ తెలిపారు.అలాగే జుక్కల్‌లో పోస్టాఫీసు భవనం మంజూరైందన్నారు. రెండు నెలల క్రితం ఢిల్లీలో తపాల శాఖ కేంద్రమంత్రి జ్యోతిరాధిత్య సింధియాను కలిసి భవనం నిర్మాణాలపై వినతి పత్రం అందించానని అజయ్ పేర్కొన్నారు.

మంచినీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు

భిక్కనూరు: మండలంలోని కాచాపూర్ గ్రామంలో మంచి నీటి పైప్‌లైన్‌కు గురువారం మరమ్మతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మౌనిక మాట్లాడుతూ గ్రామంలోని నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట

రాజంపేట: మండలంలోని గుండారం, నడిమి తండా, ఎల్లాపూర్ తండాల్లో ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారనే సమాచారం మేరకు ఎస్సై పుష్ప రాజ్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బాబాల ఆధ్వర్యంలో వాగులోకి వెళ్లే అక్రమ రవాణా చేస్తున్న దారులను కందకాలను తవ్వి మూసివేసినట్లు తహసీల్దార్ సతీష్‌రెడ్డి తెలిపారు. ఇటీవల అక్రమ ఇసుక చేస్తున్న వాహనాలను సైతం సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డిరూరల్: రైతులు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎన్‌డీసీసీ కోఆపరేటివ్ బ్యాంకు అధికారులు అన్నారు. గురువారం ఎల్లారెడ్డి మండలం తిమ్మాపూర్ గ్రామంలో రుణాలపై అవగాహన కల్పించారు. రైతులకు కోఆపరేటివ్ బ్యాంకు పంట పొలాలపై, బంగారంపై తక్కువ వడ్డీకి రుణాలను అందిస్తుందన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం లాడేగావ్ గ్రామంలో కూలీలు చేస్తున్న ఉపాధి పనులను గురువారం ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. కొలతల ప్రకారంగా ఉపాధి పనులు చేయాలని కూలీలకు ఆయన సూచించారు. కూలీల హాజరు మస్టర్లల్లో సక్రమంగా నమోదు చేయాలన్నారు.

చెత్తబండి కోసం 34వ వార్డువాసుల వినతి

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని 34వ వార్డులో ఇంటింటి చెత్త సేకరణ కోసం వచ్చే చెత్త బండి వారానికి రెండు, మూడు సార్లు మాత్రమే వస్తుందని మున్సిపల్ అధికారులు పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని వార్డు పరిధిలోని ఆర్యనగర్, మధురానగర్ కాలనీవాసులు కోరారు. ప్రభుత్వం వార్డు అధికారులను నియమించిన వారు సైతం అందుబాటులో ఉండడం లేదని, చెత్త బండి కోసం ఎదురుచూపులు తప్పడం లేదన్నారు.

22న ఎంఎస్ఎన్ ఔషధ కంపెనీ ఉద్యోగమేళా

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సెమినార్ హాల్‌లో ఈనెల 22న ఉదయం 10గంటలకు ప్రముఖ ఔషధ ఉత్పత్తి కంపెనీ ఉద్యోగ మేళా నిర్వహిస్తుందని కళాశాల ప్రిన్సిపల్ కే.విజయ్‌కుమార్ తెలిపారు. బీఎస్సీ(కెమిస్ట్రీ), పీజీ కెమిస్ట్రీ, బీ ఫార్మసీ, డిప్లొమా ఉత్తీర్ణులైన వారు అకాడమిక్ సర్టిఫికెట్లు, ఆధార్, పాస్ సైజ్ ఫోటోతో నేరుగా హాజరు కావాలని సూచించారు. వివరాలకు 99631 92369, 98498 26244 నంబర్లకు సంప్రదించవచ్చని పేర్కొన్నారు.